క్లుప్తంగా

పౌరహక్కుల దినోత్సవం



అవగాహన కల్పిస్తున్న ఆర్‌ఐ అడెల్లు

కుంటాల: పౌరహక్కులకు భంగం కలిగించొద్దని ఆర్‌ఐ అడెల్లు సూచించారు. బుధవారం మండలంలోని కల్లూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఏ ఎస్సై దేవన్న, కార్యదర్శి భోజన్న, రమణా గౌడ్, భోజన్న, సాయిరాం, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టుశిక్షణ ప్రారంభం

దిలావర్‌పూర్: మండలంలోని సాంగ్వి గ్రామంలో మహిళా సంఘాల సభ్యుల కోసం సెర్ప్ డీపీఎంలు మారుతి, విజయలక్ష్మి, శోభారాణి బుధవారం కుట్టు శిక్షణను ప్రారంభించారు. మహిళలు శిక్షణ పొంది ఆర్థికంగా వృద్ధి చెందాలని వారు సూచించారు. ఏపీఎం సులోచనరెడ్డి, సీసీ ముత్యం, వీవోఏ భూషణ్, కోఆర్డినేటర్లు హరీశ్, రమేశ్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



తనిఖీ చేస్తున్న ఎస్‌సీడీ అధికారి ఆశిష్‌రెడ్డి

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని బుధవారం ఎన్‌సీడీ జిల్లా అధికారి డాక్టర్ ఆశిష్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి డాక్టర్ ప్రియాంక, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీహెచ్‌వో రాజేశ్వర్, ఫార్మసిస్ట్ శ్యామ్యూల్, ఆశ కార్యకర్తలు శోభ, విజయ తదితరులున్నారు.

నేటి నుంచి ‘ఆకాంక్ష హ్యాట్’ హస్తకళల ప్రదర్శన

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని అంబేద్కర్ భవనంలో గురువారం నుంచి ‘ఆకాంక్ష హ్యాట్’ పేరిట హస్తకళల ప్రదర్శన, కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నీతి ఆయోగ్ ఆకాంక్ష హ్యాట్ కార్యక్రమంలో భాగంగా వచ్చే నెల 4వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఈ ఐదు రోజులు జిల్లాలోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన హస్తకళల ఉత్పత్తులు ప్రదర్శించి విక్రయిస్తారని న్నారు. ప్రారంభోత్సవానికి కలెక్టర్, ఖానాపూర్ ఎమ్మెల్యే, జిల్లా అధికారులు, అతిథులు హాజరవుతారని పేర్కొన్నారు.

ఘనంగా ప్రతిష్ఠాపన



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామ హనుమాన్ ఆలయంలో బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం వీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పండితులు ప్రశాంత్ ఆచార్య ఆధ్వర్యంలో గణపతిపూజ, హోమం, తదితర పూజలు, అన్న సంతర్పణ కార్యక్రమాలు చేపట్టారు. టేకు గంగారాం, మోతె రాజేశ్వర్, సంతోశ్, నవీన్, రాజేశ్వర్, నర్సింగ్ రావు, సురేందర్, శివ, ధర్మరాజు, రమేశ్, స్వామి, చరణ్ తదితరులున్నారు.

వంట పరిసరాలు శుభ్రంగా ఉంచాలి



కేజీబీవీలో పరిశీలిస్తున్న అధికారి ఆకాశ్

భైంసాటౌన్: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో వంట చేసే పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఆకాశ్ అన్నారు. బుధవారం పట్టణంలోని కేజీబీవీతో పాటు సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా వంట గదులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో వంట సామగ్రి శుభ్రమైన ప్రదేశంలో నిల్వ చేయాలన్నారు. ఆహార పదార్థాలు చెడిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బస్తీ దవాఖాన వైద్యులు కమలేశ్, సీహెచ్‌ఓ గంగాధర్, సూపర్‌వైజర్ నరేశ్ ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

లక్ష్మణచాంద: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ఆరోగ్య కార్యకర్త శివకృష్ణ పేర్కొన్నారు. బుధవారం లక్ష్మణచాంద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ప్రత్యూష ఆదేశాల మేరకు మండలంలోని పీచర గ్రామంలో ఇంటింటికీ వెళ్లి జ్వర లక్షణాలున్న వారికి రక్తపరీక్షలు నిర్వహించారు. వారికి అవసరమైన మందులు అందించారు.

సమస్యల్లో కుభీర్ పీహెచ్‌సీ

- కానరాని నీటిసౌకర్యం, ప్రహరీ
- ఖాళీగా సిబ్బంది పోస్టులు
- గోసపడుతున్న రోగులు



చిన్నపాటి వర్షానికే ఆసుపత్రి ఆవరణలోకి చేరిన వరద (ఫైల్)

కుభీర్: మండలకేంద్రమైన కుభీర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) సమస్యలకు నిలయంగా మారింది. కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఆసుపత్రికి వచ్చే పేదప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బోరు, మోటారు ఉన్నప్పటికీ కనెక్షన్ ఇవ్వకపోవడంతో మరుగుదొడ్లకు నీటి సౌకర్యం లేదు. దీంతో రోగులతోపాటు ఆసుపత్రికి వచ్చే ప్రజలు ఒంటికి, రెంటికీ అవస్థలు పడుతున్నారు. సెప్టిక్ ట్యాంక్ పగిలిపోవడంతో దుర్వాసన వస్తుంది. రోజుకు 100 మందికి పైనే రోగులు వస్తుంటారు. మరోవైపు ఆసుపత్రిలో మెజార్టీ పోస్టులు ఖాళీగా ఉండటంతో వైద్యసేవలు సరిగా అందడం లేదని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

20 ఏళ్లుగా రెగ్యులర్ డాక్టర్ లేరు..

ఆసుపత్రిలో ఇద్దరు వైద్యులకు గాను ఒక్క వైద్యుడే కాంట్రాక్టు పద్ధతిన విధులు నిర్వర్తిస్తున్నాడు. గత 20 ఏళ్లుగా ఇక్కడ రెగ్యులర్ డాక్టర్ లేరు. ప్రస్తుతం కాంట్రాక్ట్ వైద్యుడే దిక్కు. ఫార్మసిస్ట్ పోస్టు, రెండు స్టాఫ్‌నర్సు పోస్టులు, ఎమ్‌ఎల్ ఎస్‌పీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రెండు ఏఎన్‌ఎం పోస్టులు, పీహెచ్‌ఎన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

కూలిన ప్రహరీ, దెబ్బతిన్న గోడలు..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుట్టూ 15 ఏళ్ల కిందట నిర్మించిన ప్రహరీ రోడ్డు వైపు కూలింది. ఆసుపత్రి భవనం సైతం వెనకాల గోడలు బీటలు బారాయి. ప్రహరీ లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే ఆసుపత్రి ఆవరణలో వరద చేరుతోంది. ఏటా వర్షాకాలంలో ఇదే సమస్య. మరుగుదొడ్డి ట్యాంకు పగిలిపోయి ఉంది. ఆసుపత్రిలో ప్లంబరింగ్ (పైపులైన్)వ్యవస్థ సక్రమంగా లేదు. ఇటీవల మరమ్మతులు చేపట్టినా.. సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదు. దాంతో ఆసుపత్రిలో నీళ్లకు ఇబ్బందిగా ఉంది. మరుగుదొడ్ల వ్యవస్థ సక్రమంగా లేదు. ఆసపత్రి ఆవరణను కొందరు బయటి వ్యక్తులు పార్కింగ్ ప్రదేశంగా ఉపయోగించుకుంటున్నారు.

75 గ్రామాలకు ఇదే దిక్కు..

కుభీర్ మండలంలోని 38 రెవెన్యూ గ్రామాలు రెండు మదిరలు కలుపుకొని 75గ్రామాల ప్రజలకు ఈ ఆసుపత్రికే వైద్యం కోసం వచ్చి వెళ్తుంటారు. సుమారు 60వేల జనాభాకు ఈ ఆసుపత్రే దిక్కు. గతంలో ఇక్కడ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరిగేవి.. ప్రస్తుతం జరగడంలేదు. ఈ ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించి 30 పడకల స్థాయికి పెంచితే మండలంలోని పేదప్రజలకు ఎంత మేలు జరుగుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.



కూలిన ఆసుపత్రి ప్రహరీ



ఆసుపత్రిలో నీటి సౌకర్యం లేని మరుగుదొడ్డి



పగిలిన సెప్టిక్ ట్యాంకు

ప్రహరీ నిర్మించాలి



ఆసుపత్రికి ప్రహరీ నిర్మించి వరదనీరు ఆవరణలోకి రాకుండా చూడాలి. తాగునీటితోపాటు మూత్రశాలలు, మరుగుదొడ్లలో నీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలి. – గంగాశేఖర్,కుభీర్

పోస్టులు భర్తీ చేయాలి



ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి. ఆసుపత్రికి సరిపడా మందులు సరఫరా చేయాలి. వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. – ఉప్పు దత్తాత్రి, కుభీర్

ప్రతిపాదనలు పంపించాం

ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. ఖాళీగా పోస్టులను భర్తీ చేయడం ప్రభుత్వ పరిధిలో ఉంది. వానాకాలం దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన వారికి మందులు అందిస్తున్నాం. – రాథోడ్ విజయ్, కుభీర్ వైద్యాధికారి

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

దిలావర్‌పూర్: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు దిలావర్‌పూర్ మండల సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఏపీఓ దివ్యారెడ్డి పేర్కొన్నారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలు తనిఖీ బృందాలు సేకరించినట్లు పేర్కొన్నారు. తనిఖీ తుది నివేదకలు అందించేందుకు ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇందులో ఆయా గ్రామాల ఎఫ్‌ఏలు, కూలీలు తరలిరావాలని కోరారు.

కొండముచ్చుకు అంత్యక్రియలు

తానూరు(ముధోల్): ముధోల్ మండలకేంద్రంలోని కాల్వగల్లిలో కుక్కల దాడిలో కొండముచ్చు మృతి చెందగా.. గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించారు. కాల్వగల్లి బైపాస్ రోడ్డు హనుమాన్ ఆలయం ఎదుట సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు జరిపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దేవోజి భూమేశ్, కాలనీవాసులు ఎల్మా సురేశ్, కందోళ్ల శంకర్, గోసుల రాజు, హంగిర్గా లక్ష్మణ్, పోశట్టి, రాకేశ్, పద్మటి యోగేశ్, సాయిలు, పీరాజీ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఈరోజు

ఉపాధ్యాయులకు శిక్షణ

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం జీవశాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో అశోక్‌వర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ తరగతులకు లక్ష్మణచాంద, మామడ, దిలావర్‌పూర్, నర్సాపూర్ (జి)మండలాల ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత, కేజీబీవీల్లోని జీవశాస్త్ర ఉపాధ్యాయులు హాజరు కావాలని ఆయన కోరారు

రేషన్‌కార్డుల పంపిణీ

తానూరు: మండలకేంద్రంలోని రైతువేదికలో గురువారం ఉదయం 11 గంటలకు లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ మహేందర్‌నాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే రామారావ్ పటేల్ హాజరవుతారని, అధికారులు, నాయకులు రావాలని కోరారు.

ప్రజా సంక్షేమానికే ప్రభుత్వం పెద్దపీట

- కలెక్టర్ అభిలాష అభినవ్, ఎమ్మెల్యే బొజ్జు



మహిళకు కుట్టుమిషన్ అందిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఖానాపూర్: ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం మండలంలోని సత్తన్‌పల్లి రైతువేదికలో నూతన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ గత పదేళ్లలో చేయని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే చేసిందని పేర్కొన్నారు. రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని.. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీఆర్‌ఎస్ పాలనలో ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు కూడా ఇవ్వలేదని.. కాంగ్రెస్ హయాంలో మాత్రం ఊరూరా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా పథకం కింద పలువురు మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ బాలుర, బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఎమ్మెల్యేతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులకు సంబంధించి పలు ప్రశ్నలు వేసి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. అనంతరం హాజరు, మెనూ పరిశీలించారు. అక్కడే ఉన్న భవిత విలీన విద్యావనరుల కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ పడిగెల భూషణ్, వైస్ చైర్మన్ ఎంఏ మజీద్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

‘డబుల్’ ఇళ్లను అర్హులకే అందిస్తాం

ఖానాపూర్: గత ప్రభుత్వంలో అవకతవకలకు పాల్పడి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు పొందిన అనర్హులను ఖాళీ చేయించి అర్హులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసితో పాటు ఎంసీపీఐ(యూ), బహుజన కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో ఇల్లు రాని పేదలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. అర్హులకు న్యాయం చేయాలని కోరారు. తమపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని విన్నవించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విచారణ చేయించి అర్హులకే ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సునారికారి రాజేశ్, అల్లెపు పీటర్, పస్పుల వెంకన్న, బుక్య సురేందర్, దుర్గం లింగన్న, రాధ, పద్మ, గౌస్, కవిత, సునీత, ప్రమీల, అన్వర్, మున్నా, శిరీష, అమృత, భాస్కర్, భీమేశ్, సాదుల్లా, తదితరులున్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక చేయూత



టెంబుర్నిలో చెక్కులు అందజేస్తున్న దాతలు



అంబారిపేటలో సాయం అందిస్తున్న గ్రామస్తులు

నిర్మల్: నర్సాపూర్ (జి) మండలంలోని టెంబుర్ని గ్రామానికి చెందిన బొగుడమీది సంతోష్ ఇటీవల గల్ఫ్ దేశం వెళ్లి ప్రమాదవశాత్తు మరణించాడు. ఇంటి పెద్దదిక్కును కోల్పోవడంతో పలువురు దాతలు బుధవారం బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రమోద్ చంద్రారెడ్డి రూ.40వేల చెక్కు, టెంబుర్ని, నర్సాపూర్ (జి) గ్రామాల ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసు, ఫారెస్ట్ ఉద్యోగులు, ఇతరులు పోగు చేసిన రూ.65వేల చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కడెం: మండలంలోని అంబారిపేట్‌లో బాలరాజవ్వ ఇటీవల అనారోగ్యంతో మరణించింది. బుధవారం గ్రామ మాజీ ఎంపీటీసీ కట్ల సింధూజసాగర్, తదితరులు రూ.8వేలను బాధిత కుటుంబానికి సాయంగా అందించారు. మండలంలోని కొండుకూర్‌కు చెందిన కొల్లూరి శ్రీనివాస్ 25 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో కొప్పుల నారాయణ, గడ్డం రాజు, కొమ్ము రమేశ్ తదితరులున్నారు.

బియ్యం పంపిణీలో కేంద్రానిదే మెజార్టీ వాటా

- ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్



భైంసాలో లబ్ధిదారుకు నూతన రేషన్‌కార్డు అందిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసాటౌన్: ప్రభుత్వం ఇచ్చే రేషన్ బియ్యం కోటాలో కేంద్ర ప్రభుత్వానిదే మెజార్టీ వాటా అని ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. బుధవారం పట్టణంలోని సురలోక్ గార్డెన్‌లో లబ్ధిదారులకు కొత్త రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన లబ్ధిదారులకు కార్డులు అందజేసి మాట్లాడారు. రేషన్ బియ్యం కోసం కేంద్రప్రభుత్వం కిలోకు రూ.40 అందిస్తుందని.. గత పాలకులు పదేళ్లపాటు రేషన్‌కార్డులు ఇవ్వకపోవడంతో పేదలు ఇబ్బందులు పడ్డారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులకు రేషన్‌కార్డులు అందించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన

కుంటాల: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అంబకంటి శివాలయంలో గణపతి, శివలింగం, నాగదేవత, నంది, ధ్వజస్తంభం, శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. పండితుడు భగవాన్ జోషి ఆధ్వర్యంలో దేవతామూర్తులను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సమీకృత వ్యవసాయంతో లాభాలు



సోన్ : ఆయిల్‌పాం తోటలో నాటుకోళ్ల పెంపకం పరిశీలిస్తున్న జిల్లా అధికారి రమణ

సోన్: సమీకృత వ్యవసాయంతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి బీవీ రమణ అన్నారు. మండలంలోని న్యూబొప్పారం గ్రామానికి చెందిన నారాయణరెడ్డి అనే రైతు తన 6 ఎకరాల్లో ఆయిల్‌పాం పంటను సాగు చేస్తున్నాడు. ఈ తోటలోనే గొర్రెల పెంపకం, నాటు కోళ్ల పెంపకం చేపట్టాడు. ఈ క్షేత్రాన్ని బుధవారం అధికారి సందర్శించి పలు సూచనలు చేశారు. మిగతా రైతులు సైతం ఇతడిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. నిర్మల్ డివిజన్ ఉద్యాన అధికారి సాదుల మౌనిక, ఆయిల్ పామ్ క్లస్టర్ ఆఫీసర్ మధు, రైతు నారాయణ రెడ్డి ఉన్నారు.

మామడ: ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందని ఉద్యాన శాఖ నిర్మల్ డివిజన్ అధికారి సాదుల మౌనిక అన్నారు. బుధవారం మండలంలోని దిమ్మదుర్తి రైతువేదికలో అన్నదాతల అవగాహన సమావేశంలో మాట్లాడారు. ఆయిల్‌పాం సాగుకు ఉద్యానశాఖ, ఉపాధిహామీ శాఖల ఆధ్వర్యంలో ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ సుశీల్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ చరణ్, ఏఈఓ శివ, యూనిక్ కంపెనీ ప్రతినిధి శశాంక్ ఉన్నారు.

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య



బాలశక్తి మిషన్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, అధికారులు

సోన్: సర్కారు బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం సోన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలశక్తి మిషన్ క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. పాఠశాల విద్యార్థులకు ఆరోగ్యం, ఆర్థిక, అక్షరాస్యత, జీవన నైపుణ్యాలు వంటి నాలుగు అంశాలపై అవగాహన కల్పించేందుకు కలెక్టర్ అభిలాష అభినవ్ రూపకల్పన చేసిన బాలశక్తి మిషన్ ప్రతిష్టాత్మకమైందని పేర్కొన్నారు. ఇటీవల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఖగోళ శాస్త్ర పరిశోధన ల్యాబ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ రాజేందర్, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్, ఎంఈఓ పరమేశ్వర్, ఎంపీడీవో సురేశ్, ఎంపీవో ఖలీల్ హైమద్, హెచ్‌ఎం ఆరాధన, ఉపాధ్యాయులు, బీజేపీ నేతలు మార గంగారెడ్డి, సాగర్, హరీశ్‌రెడ్డి, జక్కు రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

కడెం: ఉపాధ్యాయుల సమస్యలను వచ్చే నెల 15 లోగా పరిష్కరించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు బీవీ.రమణ అన్నారు. బుధవారం కడెంతో పాటు మండలంలోని లింగాపూర్ జెడ్పీ పాఠశాలలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడారు. సీపీఎస్ విధానం రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 1న, ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహాధర్నా కార్యక్రమానికి ఉపాధ్యాయులు తరలిరావాలని పిలుపునిచ్చారు. పీఆర్టీయూ మండలాధ్యక్షుడు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి మహేశ్, మెరుగు శ్రీనివాస్‌రెడ్డి, వాల్గొట్ కిషన్, ప్రభాకర్, శ్రీనివాస్, పుండలిక్ తదితరులున్నారు.

భోజనం అందించాలి

లోకేశ్వరం: పరిసరాలు శుభ్రంగా ఉంచుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని కేజీబీవీని సందర్శించారు. ఈసందర్భంగా వంటగదిని పరిశీలించి ఎంపీడీవో మాట్లాడారు. వెనుకబడిన విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. శుద్ధజలం అందుబాటులో ఉంచి.. పరిశుభ్రత ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించాలని పేర్కొన్నారు. ఎంపీవో సోలా మన్‌రాజ్, ప్రిన్సిపాల్ అనసూయ తదితరులు ఉన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

లక్ష్మణచాంద: రోగాల బారిన పడకుండా విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్యురాలు ఫర్జానా బేగం పేర్కొన్నారు. బాలశక్తి కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పలువురికి మందులు అందించారు. ఆర్థిక అక్షరాస్యత, ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలను కల్పించడం బాలశక్తి కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎంఈవో అశోక్‌వర్మ, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎం కృష్ణవేణి, ఫార్మసిస్ట్ శశిధర్, సీఆర్పీ సుధాకర్ పాల్గొన్నారు.

‘బీజేపీ కార్యకర్తలతో రేషన్‌కార్డుల పంపిణీ సరికాదు’

భైంసాటౌన్: కొత్త రేషన్‌కార్డులను బీజేపీ కార్యకర్తలతో పంపిణీ చేయించడం సమంజసం కాదని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. బుధవారం పట్టణంలోని ఏఎంసీ కార్యాలయంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఫారూక్ అహ్మద్, ఆత్మ చైర్మన్ వివేకానంద్, పీఏసీఎస్ చైర్మన్ ఆమెడ దేవేందర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ప్రొటోకాల్ ప్రకారం నామినేట్ పదవుల్లో ఉన్న తమను కాదని.. అధికారులు పట్టణంలో బీజేపీ కార్యకర్తలతో కార్డులు పంపిణీ చేయించారని వాపోయారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

అన్నదానం

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ పంచాయతీ పరిధి గంగాయిపేట్ గ్రామంలో బుధవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ ఖానాపూర్ అన్నదాత ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

సంక్షిప్త వార్తలు

లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ బాబురావు జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమం చేపట్టారు. క్లబ్ సభ్యులు సాదుల వెంకటస్వామి, రాచమల్ల రాజశేఖర్, రాంచందర్, సుదర్శన్, సంజీవ్‌రావు, జితేందర్ ఉన్నారు.

స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ తరగతులు

తానూరు(ముధోల్): ముధోల్ శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులకు స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు భగవాన్ దాస్ (శ్రీ సరస్వతీ విద్యాపీఠం పూర్వ ఉపాధ్యాయుడు) జ్యోతి ప్రజ్వలన చేసి విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. ప్రధానాచార్యులు సారథి రాజు తదితరులున్నారు.

‘పెద్దమ్మతల్లి ఆలయాన్ని పునర్నిర్మించాలి’

తానూరు(ముధోల్): హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి ఆలయాన్ని పునర్నిర్మించేలా చూడాలని బుధవారం ముధోల్ హిందూ ఉత్సవ కమిటీ హిందూ వాహిని ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ముధోల్ హిందూ ఉత్సవ కమిటీ, హిందు వాహిని సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యువతి వివాహానికి చేయూత

ఖానాపూర్: పట్టణానికి చెందిన మున్సిపల్ కార్మికుడి కూతురు నీరజ వివాహానికి టీకేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 5 వేల విలువైన బియ్యం బుధవారం అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఒడ్డెపల్లి కృష్ణంరాజు సమకూర్చిన సరుకులను ఫౌండేషన్ సభ్యులు యువతి కుటుంబానికి అందజేశారు. క్లబ్ సభ్యులు, కాలనీవాసులు ఉన్నారు.